



- గుంతకల్లు అభ్యర్థి గుమ్మనూరు జయరాం
- అనంత అర్బన్ అభ్యర్థి దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్
- పార్లమెంటు స్థానానికి అంబికా లక్ష్మీనారాయణ ఖరారు
- జిల్లాలో టీడీపీ కూటమి అభ్యర్థుల ఎంపిక పూర్తి



జిల్లాలో అసెంబ్లీ, పార్లమెంటు స్థానాలకు కూటమి అభ్యర్థులను ఖరారు చేశారు. తొలివిడత ఆరు నియోజకవర్గాలకు అభ్యర్థులను ఖరారు చేశారు. తాజాగా పెండింగ్‌లో ఉన్న అనంతపురం పార్లమెంటు, అనంతపురం అర్బన్, గుంతకల్లు అసెంబ్లీ నియోజకవర్గాలకు అభ్యర్థులను టీడీపీ అధినాయకత్వం శుక్రవారం ప్రకటించింది. దీంతో ఉత్కంఠకు తెరపడింది. అనంతపురం అర్బన్ నియోజకవర్గానికి రాప్తాడు మాజీ ఎంపీపీ దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్, గుంతకల్లు నియోజకవర్గానికి మాజీ మంత్రి గుమ్మనూరు జయరాం అభ్యర్థిత్వాలను టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఖరారు చేశారు. అనంతపురం లోక్‌సభ నియోజకవర్గానికి శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబికా లక్ష్మీనారాయణ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశారు. దీంతో జిల్లాలోని 8 అసెంబ్లీ, ఒక పార్లమెంటు నియోజకవర్గానికి కూటమి అభ్యర్థుల ఎంపిక పూర్తయింది.

-ఆంధ్రజ్యోతి, అనంతపురం

ఇంక రెడీ...!

ఆ రెండింటి ఉత్కంఠకు తెర



అభ్యర్థులు వీరే...

జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ స్థానాలకు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థుల ఎంపిక పూర్తి అయ్యింది. రాప్తాడు నుంచి మాజీ మంత్రి పరిటాల సునీత, రాయదుర్గం నుంచి మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు, ఉరవకొండ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్, గుంతకల్లు నుంచి మాజీ మంత్రి గుమ్మనూరు జయరాం, ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గం శింగనమల నుంచి బండారు శ్రావణిశ్రీ, తాడిపత్రి నుంచి జేసీ అస్మిత్‌రెడ్డి, కళ్యాణదుర్గం నుంచి అమిలినేని సురేంద్రబాబు, అనంతపురం అర్బన్ నుంచి దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్‌ను అభ్యర్థులుగా ప్రకటించారు. అనంతపురం ఎంపీ అభ్యర్థిగా అంబికా లక్ష్మీనారాయణను ప్రకటించారు.

దగ్గుబాటి నేపథ్యం..



పేరు: దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్
తండ్రి: దగ్గుబాటి చిన్నారప్ప
తల్లి: దగ్గుబాటి ప్రమీలమ్మ
భార్య శ్రీలక్ష్మి
కుమారుడు: మణిహాస్
కుమార్తె: అశ్రిత
పుట్టిన తేదీ: 10-8-1975
ఊరు: ఎం. బండమీదపల్లి, రాప్తాడు మండలం
విద్యార్హత : బీటెక్
రాజకీయ నేపథ్యం: 2014లో రాప్తాడు మండలం బండమీదపల్లి నుంచి టీడీపీ ఎంపీటీసీ అభ్యర్థిగా పోటీ చేసి 535 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. రాప్తాడు ఎంపీపీగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత ఎంపీపీల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎంపికయ్యారు. రాప్తాడు మండలంలోని పలు గ్రామాల్లో ఉచిత తాగునీటి ప్లాంట్లను ఏర్పాటు చేశారు. గ్రామాల్లో సీఎస్‌ఆర్ స్కీం కింద పలు అభివృద్ధి పనులు చేపట్టారు. పోలీసు సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. బండమీదపల్లి గ్రామంలో దళిత కుటుంబాలకు ఇళ్ల పట్టాలను అందజేశారు. గ్రామాల్లో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించారు. ప్రస్తుతం అనంతపురం అర్బన్ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎంపికయ్యారు.

గుమ్మనూరు నేపథ్యం



పేరు : గుమ్మనూరు పి.జయరాం
తల్లిదండ్రులు: పెంచలపాడు పార్వతమ్మ, పెంచలపాడు బసప్ప
భార్య పి.రేణుక
పిల్లలు: మాధవి, ఈశ్వర్
పుట్టిన తేదీ : 16-010-1967
విద్యార్హత: ఎస్ఎస్ఎల్‌సీ
స్వస్థలం: గుమ్మనూరు, చిప్పగిరి మండలం, కర్నూలు జిల్లా
రాజకీయ నేపథ్యం: టీడీపీ తరఫున 2001లో ఏరూరు (చిప్పగిరి మం.) ఎంపీటీసీ అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయారు. 2005లో చిప్పగిరి మండలం జడ్పీటీసీ సభ్యుడిగా గెలుపొందారు. 2009లో ప్రజారాజ్యం నుంచి ఆలూరు ఎమ్మెల్యే స్థానానికి పోటీచేసి ఓటమి చెందారు. 2011లో వైసీపీలో చేరారు. 2014లో వైసీపీ తరఫున ఆలూరు నుంచి పోటీచేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2019లోనూ రెండోసారి వైసీపీ నుంచి పోటీచేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. సీఎం వైఎస్ జగన్ మంత్రివర్గంలో కార్మిక, ఉపాధి, శిక్షణ మంత్రిగా పనిచేశారు. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో భాగంగా పరిశ్రమల శాఖ మంత్రిగా పనిచేశారు. ఈ ఎన్నికల్లో వైసీపీ ఆలూరు ఎమ్మెల్యే టిక్కెట్ దక్కకపోవడంతో ఈ నెల 5న జయహో బీసీ సభలో చంద్రబాబు నాయుడు సమక్షంలో టీడీపీలో చేరారు. ప్రస్తుతం టీడీపీ తరుఫున గుంతకల్లు నియోజకవర్గ అభ్యర్థిగా ఎంపికయ్యారు.

అనంతపురం ఎంపీ అభ్యర్థి అంబికా..



పేరు: అంబికా లక్ష్మీనారాయణ
తండ్రి పేరు: జీవీ చలపతి(లేట్)
తల్లి పేరు: లక్ష్మీకాంతమ్మ(లేట్)
భార్య పేరు : జి.శ్యామలా దేవి
కుమార్తె: జీఎల్ పావని
అల్లుడు: ఆర్.విశ్వకాంత్
కుమారుడు : డాక్టర్ జీవీ వీక్షిత్
పుట్టిన తేదీ: 19-12-1965
ఊరు: హిందూపురం
విద్యార్హత: బీఎస్సీ
వృత్తి: మేనేజింగ్ పార్ట్‌నర్, అంబికా గ్రూప్ ఆఫ్ ఫర్మ్స్
రాజకీయ నేపథ్యం: కాంగ్రెస్ అభ్యర్థిగా 2009 అసెంబ్లీ ఎన్నికల్లో హిందూపురం నుంచి పోటీ చేశారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో కాంగ్రెస్‌ను వీడి 2013లో టీడీపీలో చేరారు. 2014, 2019 ఎన్నికలలో పార్టీ అభ్యర్థుల విజయంలో కీలకపాత్ర వహించారు. అసెంబ్లీ, స్థానిక సంస్థల ఎన్నికలలో చురుగ్గా పనిచేశారు. 2019లో అహుడా చైర్మన్‌గా నియమితులై.. సేవలు అందించారు. టీడీపీ హిందూపురం పార్లమెంటు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా సేవలు అందిస్తున్నారు. హిందూపురం నియోజకవర్గంలో ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ తనవంతు సాయం చేశారు. మైనార్టీల అభ్యున్నతికి కృషి చేశారు. ఉచిత వైద్య శిబిరాలు, ఉచిత అంబులెన్సు సర్వీసులు, జాబ్ మేళాలు, గ్రామీణ క్రీడా పోటీలు నిర్వహించారు. పేద విద్యార్థులకు అంబికా ఫౌండేషన్ ద్వారా సహాయ సహకారాలు అందించారు.

ఆ నోటూ.. ఈ నోటూ..!

పింఛన్ నగదుతోపాటు ఓటుకు నోటు..?

- వలంటీర్ల ద్వారా పంపిణీకి వైసీపీ ఎత్తుగడ..?
- జోరుగా ప్రచారం.. అధికారులు అప్రమత్తం
- ఏప్రిల్ పింఛన్ మూడు రోజులు ఆలస్యం



పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్, సచివాలయ సిబ్బంది (ఫైల్)

అనంతపురం క్లాక్‌టవర్: ఎన్నికలలో డబ్బుల పంపిణీకి వలంటీర్లను వాడుకోవాలని అధికార పార్టీ ఎత్తుగడ వేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఏప్రిల్, మే నెలలలో పింఛన్లను పంచేందుకు తీసుకెళ్లే నగదుతోపాటు.. అధికార పార్టీ అభ్యర్థుల తరఫున 'ఓటుకు నోటు' పంచాలని వ్యూహం పన్నినట్లు తెలిసింది. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా పలువురు వలంటీర్లు వైసీపీ అభ్యర్థుల తరఫున ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. అధికారులు కొందరిపై వేటు వేశారు. విధుల నుంచి తొలగించారు. మరికొందరిపై కేసులు నమోదు చేయించారు. ఎన్నికల విధులకు వలంటీర్లను దూరం పెట్టాలని ఎన్నికల సంఘం ఇప్పటికే ఆదేశించింది. అధికారులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా.. అధికార పార్టీవారు వలంటీర్లను వాడుకోవడం మానటం లేదు. చాలామంది చేత రాజీనామా కూడా చేయిస్తున్నారు. మళ్లీ అధికారంలోకి వస్తామని, తిరిగి విధుల్లోకి తీసుకుంటామని అంటున్నారు. కానీ.. ఒకసారి వలంటీరు పోస్టు అవసరం లేదని రాజీనామా చేశాక.. తిరిగి ఆ పోస్టు పొందే అవకాశం ఉండదని అధికారులు అంటున్నారు.

బటన్ నొక్కొచ్చుకదా..?

జగన్ అధికారం చేపట్టాక సంక్షేమ పథకాలన్నింటికీ బటన్ నొక్కుతున్నారు. ఆర్భాటంగా బ్యాంకు ఖాతాలలో నేరుగా నగదు జమ చేస్తున్నామని చెప్పుకుంటారు. అదే తరహాలో పింఛన్ సొమ్మును కూడా లబ్ధిదారుల ఖాతాలో వేయవచ్చు కదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. పింఛన్ పంపిణీ పేరిట లబ్ధిదారులకు చేరువ కావాలని, ఎన్నికల సమయంలో ఆ పరిచయాలను వాడుకోవాలని వైసీపీ ఎత్తుగడ వేసిందన్న విమర్శలు వస్తున్నాయి. ఏప్రిల్ నెలలో మూడు రోజులు ఆలస్యంగా, 3వ తేదీ నుంచి పింఛన్ పంపిణీ చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. కాగా, పింఛన్ల పంపిణీ నుంచి వలంటీర్లను దూరం పెట్టాలని రాష్ట్ర ఎన్నికల మాజీ ప్రధానాధికారి నిమ్మగడ్డ రమేష్ నేతృత్వంలోని సిటిజన్ ఫర్ డెమోక్రసీ సంఘం సభ్యులు ఎన్నికల సంఘం కమిషనర్‌ను కోరారు.

ఓటుకు నోటు..?

పింఛన్ లబ్ధిదారులకు ప్రస్తుతం నెలకు రూ.3 వేలు చొప్పున పంపిణీ చేస్తున్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన గ్రామ, వార్డు వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి నగదు అందజేస్తున్నారు. ఎన్నికల నేపథ్యంలో వలంటీర్ల చేత పింఛన్లు పంపిణీ చేయిస్తే.. అక్రమాలు జరిగే అవకాశం ఉందన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. ఎన్నికల విధులకు వలంటీర్లను ఎన్నికల సంఘం పూర్తిగా దూరం పెట్టేసింది. కానీ పింఛన్‌ల పంపిణీ వలంటీర్ల చేతులమీదుగానే కొనసాగుతోంది. ఎన్నికలకు ఇంకా 45 రోజులు గడువు ఉంది. ఈ లోగా రెండు నెలలు పింఛన్లను లబ్ధిదారులకు వలంటీర్లు అందజేస్తారు. ఇదే సమయంలో ఓటర్లకు అధికార పార్టీ అభ్యర్థుల తరఫున నగదు ఇచ్చి, ప్రలోభ పెడతారన్న ప్రచారం జరుగుతోంది. అధికారులు వలంటీర్ల ద్వారా అక్రమాలు జరగకుండా ఏ మేరకు అడ్డుకుంటారో తేలాల్సి ఉంది.

నిబంధనలకు లోబడే..



ఎన్నికల ప్రవర్తనా నియమావళికి లోబడే పింఛన్ల పంపిణీ జరుగుతుంది. ఎన్నికల విధులకు గ్రామ-వార్డు వలంటీర్లను ఎన్నికల సంఘం దూరం పెట్టింది. కానీ పింఛన్ల పంపిణీకి వలంటీర్లను వినియోగించుకోవచ్చు అని స్పష్టత ఇచ్చింది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వచ్చే నెల పింఛన్ల పంపిణీ వలంటీర్ల ద్వారానే జరుగుతుంది. ఆర్థిక సంవత్సరం ముగింపు కారణంగా ఏప్రిల్ నెలలో పింఛన్ పంపిణీ మూడు రోజులు ఆలస్యంగా చేపడుతున్నాం. బ్యాంకులకు పని ఒత్తిడి ఉంటుంది. అందుకే ఒకటో తేదీలోగా నగదు తీసుకోవడం ఇబ్బందిగా ఉంటుంది. పింఛన్‌కు సంబంధించిన నగదును మాత్రమే పంపిణీ చేయాలని ఇప్పటికే వలంటీర్లకు ఆదేశాలిచ్చాం.

- నరసింహారెడ్డి, డీఆర్‌డీఏ-వైకేపీ పీడీ

పింఛన్లు.. రేషన్ పంపిణీలో జాగ్రత్త

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు..

అధికారులకు కలెక్టర్ గౌతమి హెచ్చరిక



అనంతపురం టౌన్, మార్చి 29: ఏప్రిల్ నెలలో పింఛన్లు, రేషన్ సరుకుల పంపిణీ జాగ్రత్తగా చేపట్టాలని అధికారులకు కలెక్టరు గౌతమి ఆదేశించారు. తన క్యాంపు కార్యాలయం నుంచి శుక్రవారం జిల్లా, మండల స్థాయి అధికారలతో ఆమె టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. పింఛన్ల పంపిణీ సమయంలో ఎన్నికల కమిషన్ నిబంధనలను తప్పకుండా పాటించాలని అన్నారు. కోడ్ అమలును దృష్టిలో ఉంచుకుని పింఛన్ల నగదు తీసుకువెళ్లే సచివాలయ సిబ్బంది, వెల్ఫేర్ అసిస్టెంట్లకు, వార్డు, పంచాయతీ సెక్రటరీలకు ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు ఆథరైజేషన్ లెటర్ ఇవ్వాలని సూచించారు. పింఛన్లను పంపిణీ చేసేటపుడు ఫొటోలు, వీడియోలు తీయరాదని అన్నారు. రాజకీయ నాయకులు, ఇతర వ్యక్తుల ప్రమేయం లేకుండా పంపిణీ చేయాలని సూచించారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఎన్నికల కమిషన్ నిబంధనలను విధిగా పాటించాలని, అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆథరైజేషన్ లెటర్‌లో ఎంత నగదు పేర్కొంటే.. అంతే నగదును వలంటీర్లు తీసుకెళ్లాలని అన్నారు. అంతకన్నా ఎక్కువ నగదు వారివద్ద దొరికితే కేసు నమోదు చేయిస్తామని తెలిపారు. రేషన్ సరకుల పంపిణీలోనూ ఎన్నికల నిబంధనలు పాటించాలని అన్నారు. ఎండీయూ ఆపరేటర్లు, డీలర్లపై ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయని, కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో కరువు ఉన్నందున.. కూలీలు వలస వెళ్లకుండా ఉపాధి పనులు చూపించాలని ఆదేశించారు. తాగునీటి ఎద్దడి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ రెండు విషయాలలో ఎవరు నిర్లక్ష్యం చేసినా శాఖాపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టరు కేతన్‌గార్గ్, జడ్పీ సీఈఓ వైభోమ్ నిదియా, నగరపాలిక కమిషనర్ మేఘస్వరూప్, డీఆర్వో రామక్రిష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్‌కు నివాళులు అర్పిస్తున్న పరిటాల సునీత



నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే కేశవ్

తెలుగువారి ఆత్మగౌరవం.. టీడీపీ

మాజీ మంత్రి పరిటాల సునీత, పయ్యావుల కేశవ్

ఘనంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవం

అనంతపురం అర్బన్, మార్చి 29: తెలుగువారి ఆత్మగౌరవాన్ని దేశానికి చాటిన ఘనత తెలుగుదేశం పార్టీకే దక్కుతుందని మాజీ మంత్రి పరిటాల సునీత అన్నారు. అనంతపురం నగరంలో పార్టీ 42వ ఆవిర్భావ దినోత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి ఆమె పూలమాల వేసి నివాళులు అర్పించారు. టీడీపీ ఆవిర్భావం నుంచి రాష్ట్రంలో అనేక సంస్కరణలను ఎన్టీఆర్ ప్రవేశపెట్టారని అన్నారు. ఎన్టీఆర్ తర్వాత అదే స్థాయిలో చంద్రబాబు పార్టీని ముందుకు నడిపిస్తున్నారని అన్నారు. పార్టీకి కార్యకర్తలే బలమని అన్నారు. ఈ ఎన్నికల్లో చంద్రబాబు నాయకత్వంలో టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

ఉరవకొండ: ఆంధ్రుల ఆత్మగౌరవ నినాదంతో తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించిందని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ అన్నారు. ఉరవకొండలో టీడీపీ 42వ ఆవిర్భావ దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి కేశవ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం నందమూరి తారక రామారావు టీడీపీని స్థాపించారని అన్నారు. ఎన్టీఆర్ ఆశయ సాధన కోసం ముందుకు సాగుదామని శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ విజయ్‌భాస్కర్, మాజీ ఎంపీపీ సుంకరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు కట్టుకున్నాం..

వైసీపీవారు చేరనివ్వడం లేదు..!

అధికారుల ఎదుట పేదల గోడు



ఎస్‌ఐకి సమస్య చెప్పుకుంటున్న మహిళలు

'అప్పులు చేసి ఇళ్లు కట్టుకున్నాం. వాటిలో చేరనివ్వకుండా కొన్నేళ్ల నుంచి అడ్డుకుంటున్నారు. మాకు న్యాయం చేయండి' అంటూ చెన్నేకొత్తపల్లి మండలం బసినేపల్లికి చెందిన పలువురు లబ్ధిదారులు అధికారులకు విన్నవించారు. టీడీపీ హయాంలో గ్రామ సమీపంలోని ప్రధాన రహదారి పక్కన పలువురు ఇళ్లను నిర్మించుకున్నారు. వారిని ఇళ్లలో చేరనివ్వకుండా కొందరు వైసీపీ నాయకులు అడ్డుకుంటున్నారు. ఈ క్రమంలో కొందరు శుక్రవారం అక్కడికి వెళ్లి పనులు చేపట్టారు. వారిని వైసీపీ వర్గీయులు అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి వెళ్లి బాధితులతో మాట్లాడారు. 2016లో అప్పటి మంత్రి పరిటాల సునీత వంద మందికి పైగా పేదలకు ఇంటి స్థలాలను మంజూరు చేయించారని, అందులో 30 మంది ఇళ్లను నిర్మించుకున్నారని బాధితులు తెలిపారు. మరో 20 మంది పునాదులు వేసుకున్నారని అన్నారు. ఆ కాలనీకి సీసీరోడ్లు, తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించారని తెలిపారు. 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో తమను ఆ ఇళ్లలోకి చేరనివ్వడం లేదని, దౌర్జన్యంగా అడ్డుకుంటున్నారని లక్ష్మీదేవి, ప్రభావతి, జ్యోతి, ధనలక్ష్మి, లలిత, నాగేంద్రమ్మ, పుల్లమ్మ, కొండమ్మ, యల్లప్ప, ఆదిలక్ష్మి తదితరులు పోలీసుల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్లు కట్టుకుని ఎనిమిదేళ్లు అవుతోందని, తాము చేరకనే శిథిలావస్థకు చేరుకుంటున్నాయని వాపోయారు. తమకు న్యాయం చేయాలని కోరారు. దీంతో ఎస్‌ఐ వెంకటేశ్వర్లు రెవెన్యూ, హౌసింగ్ అధికారులతో చర్చించారు. రికార్డులను శనివారం పరిశీలిస్తామని, సమస్య పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు.

- చెన్నేకొత్తపల్లి

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

మానవాళి కోసం యేసుక్రీస్తు తన ప్రాణాలను అర్పించిన రోజు గుడ్ ఫ్రైడే అని క్రైస్తవ మత పెద్దలు అన్నారు. శుభ శుక్రవారం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సంఘ సభ్యులు బైబిల్ సారాంశాలను చదివి వినిపించారు. గాయనీ గాయకులు క్రీస్తును స్తుతిస్తూ పాటలు పాడారు. అనంతపురం నగరంలోని అన్ని చర్చిలలో క్రైస్తవుల ప్రార్థనలలో పాల్గొన్నారు.

- అనంతపురం కల్చరల్



అనంతలో ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు



రామచంద్రనగర్ కార్మెల్‌మాత చర్చిలో ప్రార్థనలు





ఇఫ్తార్	శనివారం సాయంత్రం	06:33
సెహరీ	ఆదివారం ఉదయం	04:59

ఉష్ణోగ్రతలు (శుక్ర)



గరిష్ఠం : 41.5
కనిష్ఠం : 25.0

జగనన్న లేఅవుట్ కబ్జా

పునాదులు తవ్విన వైసీపీ వర్గీయులు



జగనన్న లేఅవుట్‌లో ఇంటి పునాదులను పరిశీలిస్తున్న డిప్యూటీ తహసీల్దార్, పోలీసులు

కళ్యాణదుర్గం, మార్చి 29: కంబదూరు జగనన్న లేఅవుట్‌లో ఇంటి స్థలాలను వైసీపీ వర్గీయులు ఆక్రమించాలని చూశారు. లేఔట్‌లో 82 ప్లాట్లలో ఇళ్ల నిర్మాణం కోసం గత మూడు రోజులుగా పునాదులను తవ్వుతున్నారు. రాత్రిళ్లు జరుగుతున్న ఈ తతంగం గురించి అధికారులకు తెలియడంతో శుక్రవారం వెళ్లి అడ్డుకున్నారు. డిప్యూటీ తహసీల్దారు నారాయణ స్వామి పోలీసు సిబ్బందితో వెళ్లి ఇసుక, పునాదిరాళ్లను స్వాధీనం చేసుకున్నారు. కంబదూరుకు చెందిన తొమ్మిది మంది వైసీపీ నాయకులు పేర్లు చెప్పుకుని, వారి పేర్లతో 82 ఇళ్లకు పునాదులు అక్రమంగా తవ్వుకున్నట్లు తమ పరిశీలనలో తేలిందని అధికారులు తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. కంబదూరు భీములకుంట రోడ్డులోని జగనన్న లేఅవుట్, హైస్కూలు ప్రాంతంలోని జగనన్న లేఔట్‌లో ఏఒక్కరూ ఇంటి నిర్మాణాలు చేపట్టరాదని, నిర్మిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



నేడు ఖాద్రీశుడి బ్రహ్మరథోత్సవం

- అన్నిదారులూ కదిరివైపే..
- తరలిరానున్న భక్తజనం
- అదనపు బలగాలతో భద్రత

(వివరాలు 7లో..)

ఈ తిప్పలు ఎప్పటికి తప్పేనో..!

● కక్కలపల్లి క్రాస్‌లో మళ్లీ మురుగునీటి సమస్య ● శాశ్వత పరిష్కారం చూపని పాలకులు, అధికారులు


కక్కలపల్లి క్రాస్‌లోని సర్వీసు రోడ్డులో నిలిచిన మురుగు నీరు

అనంతపురంరూరల్, మార్చి 29: మండలంలోని కక్కలపల్లి క్రాస్‌లో మురుగునీటి కాలువ పరిష్కారానికి మోక్షం కలుగడం లేదు. తాత్కాలిక చర్యలు చేపడుతూ.. స్థానిక అధికారులు, ప్రజాప్రతి నిధులు చేతులు దులుపుకుం టున్నారు. శాశ్వత పరి ష్కరం మాత్రం చూపడం లేదు. కక్కలపల్లి క్రాస్‌లో గత కొంతకాలంగా మురుగు నీరు వెళ్లేందుకు ఇబ్బం దులు తలెత్తు న్నాయి. క్రాస్ ఎదుట వైపు ఉన్న ప్రాం తాల నుంచి మురుగు నీరు దిగువకు వస్తోంది. అయితే మురుగు నీరు వెళ్లేందుకు కాలువ లేకపో వడం సమస్యగా మారింది. వారం రోజులుగా ఈ మురుగునీరు రోడ్డుపై ప్రహిస్తుండటంతో ప్రయాణి కు లు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రోడ్డుపై మురుగునీరు నిల్వ ఉంటోంది. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు నిత్యం అటూవైపు ప్రయా ణం చేస్తునే ఉన్నారు. అయినా సమస్య పరిష్కరానికి చొరవ చూపడం లేదు.


కక్కలపల్లి క్రాస్ ఎదుటి వైపు బ్లాక్ అయిన కాలువ




దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్న ప్రయాణీకులు



దగ్గుబాటి ప్రసాద్ ప్రత్యేక పూజలు

అనంతపురం అర్బన్, మార్చి 29 : అనంతపురం అర్బన్ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ కుటుంబ సమేతంగా అనంతపురం కోర్టు రోడ్డులోని ఆంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంత పురం అర్బన్ నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను ప్రకటించిన నేపథ్యంలో ఆంజనే యస్వామి ఆలయంలో పూజలు నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు.


ఆంజనేయస్వామి ఆలయంలో దగ్గుబాటి ప్రసాద్ కుటుంబ సభ్యులు


టీడీపీలో చేరుతున్న వైసీపీ నాయకులు

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక

చెన్నేకొత్తపల్లి, మార్చి 29: మండలంలోని వెంకటాంపల్లి గ్రామానికి చెందిన వైసీపీకి చెందిన పలువురు టీడీపీలోకి చేరారు. శుక్రవారం అనంతపురంలోని క్యాంప్ కార్యాలయంలో మాజీ మంత్రి పరిటాల సునీత, టీడీపీ సీనియర్ నాయకుడు ఎల్ నారాయణచౌదరి సమక్షంలో పార్టీలోకి చేరారు. వెంకటాంపల్లికి చెందిన కమ్మన్న, నరసింహులు, లింగమయ్య, ముత్యాలమ్మ, రాములమ్మ, కుమార్ తదితరులకు పరిటాల సునీత కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి, రమణారెడ్డి, రంగారెడ్డి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ : టీడీపీ సీనియర్ నాయకుడు ప్యాదిండి నరసింహులు రెండు రోజుల క్రితం గుండెపోటుతో మరణించిన విషయం తెల్సిందే. పరిటాల సునీత శుక్రవారం హరియన్ చెరువుకు చేరుకుని కుటుంబసభ్యులను పరామర్శించారు. భార్య జయమ్మ, కుమారులను ఓదార్చి ధైర్యం చెప్పారు. అదేవిధంగా అదే గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు బెల్లం రామచంద్ర భార్య చిన్ననాగమ్మ అనారోగ్యంతో వారం రోజుల క్రితం మరణించారు. బాధిత కుటుంబాన్ని కూడా పరిటాల సునీత పరామర్శించారు. ఆమె వెంట టీడీపీ సీనియర్ నాయకుడు ఎల్ నారాయణచౌదరి, కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దండు ఓబులేసు, మాజీ ఎంపీపీ అంకే అమరేంద్ర, ప్రదాన కార్యదర్శి ముత్యాలప్ప, ఎజ్జే శంకర్, మాడెం సూర్యనారాయణరెడ్డి, రాజు, ఏపీ శ్రీనివాసులు ఉన్నారు.

ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

శింగమల,మార్చి 29: తెలుగుదేశం పార్టీ 42వ ఆవిర్భావ దినోత్సవాన్ని స్థానిక రామస్వామి దేవాలయం వద్ద శుక్రవారం ఘనంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ ఆదినారా యణ, జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి డేగల కృష్ణ మూర్తి, మారుతి నాయుడు, చింతబరిదొర, వెంకటేశ్ పెద్ద నగముని బండి వెంకటనారాయణ, చిదనంద నాయుడు, ఆదినారాయణ, కుళ్ళాయప్ప మాసూల చంద్ర, గార్లదిన్నె సత్తి, గుర్రం లక్ష్మినారా యణ, ధను, రాముడు, పెద్దన్న, అనీల్, మహేశ్ పాల్గొన్నారు.

రామగిరి : స్థానిక టీడీపీ కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ పార్టీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. పార్టీ జెండాను కార్యాలయం ఎదుట ఆవిష్కరించారు. కేక్‌కట్ చేసి అనంతరం ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కుంటిమద్ది రంగయ్య, కన్వీనర్ సుధాకర్, ప్రధాన కార్యదర్శి మారుతీ ప్రసాద్, నాయకులు పరందామ యాదవ్, శ్రీధర్ నాయుడు, ఎస్ ఆంజనేయులు, ఎంపీటీసీ శ్రీనివాసులు, ఎస్సీసెల్ పోతన్న, పేపర్ శీన, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, నాగేశ్‌నాయుడు, దుబ్బార్ల పల్లి సుబ్బరాయుడు, అక్కులప్ప, సురేశ్, వడ్డిసుబ్బు, తిరుపాలప్ప పాల్గొన్నారు.

ఆత్మకూరు: స్థానిక టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో మండ ల కన్వీనర్ శ్రీనివాసులు, తెలుగు యువత ప్రధాన కార్యదర్శి నారాయణస్వామి, పార్లమెంటు అధికార ప్రతినిధి శశాం క చౌదరి, మాజీ కన్వీనర్లు మనోరంజన్, వెంకట నారాయణ, సూరి, మండల నాయకులు మాధవరెడ్డి, రవీంద్రారెడ్డి, సుధాకర రెడ్డి, తిక్కస్వామి, రాజారమేష్, శివారెడ్డి, కందుల ఓబులపతి, కార్తీక్, నరసింహులు వెంకటేసులు, బాలానాయక్ చికెన్ వలి, ఉమాపతి, కోండారెడ్డి, గోపి, బోమ్మయ్య, లక్ష్మీదేవి, సరళ, చెన్నమ్మ పాల్గొన్నారు.

ధర్మవరంరూరల్ : కనగానపల్లి టీడీపీ కార్యాలయంలో ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కసుమూర్తి వెంకటేష్, ఎంపీటీసీ బిల్లే భాస్కర్, తెలుగు యువత బట్టా సురేష్ చౌదరి, పూజారి నాగభూషణ, ములుగూరు సంజీవ్, రాములమ్మ, పసల వెంకటేష్, లింగుట్ల రమేష్, గొల్లరామకృష్ణ, చల్లాశ్యాము, ఆవుల మురళీ, లక్ష్మీనారాయణ, మహానంది పాల్గొన్నారు.

రాప్తాడు: స్థానిక పార్టీలో కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


శింగనమలలో...


రాప్తాడులో...


రామగిరిలో..


ఆత్మకూరులో...


కనగానపల్లిలో...


రామచంద్రనగర్ కార్మెల్‌మాత చర్చిలో యేసు సిలువతో ప్రార్థనలు నిర్వహిస్తున్న క్రైస్తవులు

ఘనంగా గుడ్ ఫ్రైడే

అనంతపురం కల్చరల్, మార్చి 29: గుడ్ ఫ్రైడేను పురస్కరించుకుని శుక్రవారం జిల్లావ్యాప్తంగా ప్రార్థనలను ఘనంగా నిర్వహించారు. మానవాళి కోసం యేసుక్రీస్తు తన ప్రాణాన్ని త్యజించిన శుభశుక్రవారం సందర్భంగా వాడవాడలా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని క్రీస్తు మందిరాలన్నీ కిటకిటలాడాయి. అరవిందనగర్‌లోని సీయస్‌ఐ హోలి ట్రినిటి చర్చిలో గుడ్‌ఫ్రైడే సందర్భంగా ప్రెస్‌బిటర్, సీయస్‌ఐ హెచ్‌టీసీ అనంతపురం డివిజనల్ ఛైర్మెన్ పీడీఎస్‌జే బెన్‌హర్‌బాబు ఆధ్వర్యంలో శుభశుక్రవారపు ఆరాధనను నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన రెవరెండ్ జోషి ఆనంద్ ప్రకాష్ క్రీస్తు బోధించిన ఏడు అంశాలపై ఆధ్యాత్మిక సందేశమిచ్చారు. అనంతరం క్రైస్తవ సంఘసభ్యులు ఒకో సందేశపు బైబిల్ సారాంశాన్ని వివరించారు. సప్తగిరి సర్కిల్‌లోని ఎస్‌ఐయూ టౌన్ కాంగ్రిగేషనల్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనల నేపథ్యంలో క్రైస్తవులతో కిటకిటలాడింది. రెవరెండ్ సంపత్ విజయ్‌కుమార్ యేసు జీవిత ఇతివృత్తాంతాన్ని బోధించారు. సంఘం సభ్యులు బైబిల్ సారాంశాలను చదివి వినిపించారు. అనంతరం గాయనీగాయకులు యేసుక్రీస్తు గీతాలను ఆలపిస్తూ వీక్షకులను అలరించారు. రామచంద్ర నగర్‌లోని కార్మెల్‌మాత చర్చిలో పాస్టర్ జోసెఫ్, నగర శివారులోని క్రీస్తు విశ్వాసుల సంఘం చర్చిలో పాస్టర్ నతనియేల్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అదేవిధంగా కోర్టురోడ్డులోని గాస్పెల్‌హాల్ చర్చి, అంబేడ్కర్ నగర్‌లోని యేసుక్రీస్తు ప్రార్థనా మందిరం, కళాకారుల కాలనీలోని రేమా చర్చి, క్రీస్తు విశ్వాసుల సంఘం చర్చిలతో పాటు అన్ని ప్రాంతాలోని చర్చిల్లో గుడ్‌ఫ్రైడే ప్రార్థనలను ఘనంగా నిర్వహించారు.


కార్మెల్‌మాత చర్చిలో పార్థనలో పాల్గొన్న క్రైస్తవులు




సప్తగిరి సర్కిల్ యస్‌ఐయూ చర్చిలో సందేశమిస్తున్న పాస్టర్ సంపత్ విజయ్‌కుమార్


సనపలో..

సూపర్ సిక్స్ పథకాలపై జోరుగా ప్రచారం

అనంతపురంరూరల్/ఆత్మకూరు, మార్చి 29: అనంతపురంరూరల్ మండలంలోని గ్రామాల్లో బాబు సూపర్ సిక్స్ పై టీడీపీ శ్రేణులు శుక్రవారం జోరుగా ప్రచారం నిర్వహించాయి. కురుగుంట, చిన్నకుంట, పాపంపేట, సిండికేట్ నగర్ తదితర ప్రాంతాల్లో టీడీపీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. అలాగే ఆత్మకూరు మండలం సనప గ్రామంలో టీడీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు, టీడీపీ మండల ఇన్‌చార్జి బాలాజీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ప్రచారం చేపట్టారు.


కురుగుంటలో...

టీడీపీలో టిక్కెట్ చిచ్చు

- అనంతలో భగ్గుమన్న వైకుంఠం వర్గీయులు
- పార్టీ నియోజకవర్గ, జిల్లా కార్యాలయాల్లో విధ్వంసం
- ఫర్నిచర్, సామగ్రి, ఫ్లెక్సీలకు నిప్పు
- పార్టీకి పలువురు నాయకుల రాజీనామా


టీడీపీ జిల్లా కార్యాలయం వద్ద ఫర్నిచర్‌ను దహనం చేస్తున్న కార్యకర్తలు

అనంతపురం అర్బన్, మార్చి 29: అనంతపురం జిల్లాలో టీడీపీ టిక్కెట్ల కేటాయింపు మాజీ ఎమ్మెల్యేల వర్గీయులకు ఆగ్రహం తెప్పించింది. అనంత అర్బన్, గుంతకల్లులో పార్టీ కార్యాలయాల వద్ద ఆందోళలకు దిగారు. ఫర్నిచర్, ఫ్లెక్సీలు, కరపత్రాలను దహనం చేశారు. మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరికి టీడీపీ అనంతపురం అర్బన్ టిక్కెట్ దక్కకపోవడంతో ఆయన వర్గీ యులు భగ్గుమన్నారు. పార్టీ అర్బన్ కార్యాలయం ఎదుట టీడీపీ జెండాలు, ఫ్లెక్సీలు, కరపత్రాలను దహనం చేశారు. అనంతరం రాంనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయం వద్దకు చేరుకుని తాళాలను బద్దలుకొట్టి లోనికి ప్రవేశిం చారు. కార్యాలయంలోని కంప్యూటర్లు, ఫర్నిచర్, ఇతర సామాగ్రిని ధ్వంసం చేశారు. కార్యాలయం బోర్డును చించేశారు. కార్యాలయంలోని వస్తుసామగ్రిని బయటకు తీసుకొచ్చి దహనం చేశారు. కష్టకాలంలో పార్టీ కోసం ఐదేళ్లు పనిచేసిన వైకుంఠం ప్రభాకర్ చౌదరికి టిక్కెట్ ఇవ్వకుండా అన్యాయం చేశారని ఆయన వర్గీయులు మండిపడ్డారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కాలవ శ్రీనివాసులు ఇంటి ఎదుట తెలుగు మహిళలు పార్టీ జెండాలు, ఫ్లెక్సీలను దహనం చేసి నిరసన తెలిపారు. ఆ సమయంలో ఒక మహిళ సొమ్మసిల్లిపడిపోయారు. ప్రభాకర్ చౌదరికి టిక్కెట్ కేటాయించపోవడంతో మనస్తాపానికి గురైన ఇద్దరు కార్యకర్తలు విషం తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. అక్కడే ఉన్న పార్టీ శ్రేణు లు వారిని చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రభాకర్ చౌదరికి టిక్కెట్ కేటాయించకపోవడాన్ని నిరసిస్తూ అనంతపురం అర్బన్‌లో పలువురు నాయకులు పార్టీకి రాజీనామా చేశారు. 12 మంది క్లస్టర్ ఇన్‌చార్జిలు, 50 మంది డివిజన్ అధ్యక్షులు, 57 మంది యూనిట్ ఇన్‌చార్జిలు, 277 మంది బూత్ ఇన్‌చార్జిలు తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేశారు. వారి రాజీనామా లేఖలను పార్టీ జిల్లా అధ్యక్షుడు కాలవ శ్రీనివాసులుకు పంపించారు.


మద్దతుదారుల నిరసన

ప్రజాస్వామ్యంలో చీకటి రోజు

మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి



అనంతపురం, మార్చి 29(ఆంధ్రజ్యోతి): అనంత అర్బన్ నియోజకవర్గం టీడీపీ టికెట్ మరో వ్యక్తికి కేటాయించడం దుర్మార్గమైన చర్య, ప్రజాస్వామ్యంలో చీకటి రోజులగా భావిస్తున్నానని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి పేర్కొన్నారు. శుక్రవారం అనంతపురం నగరంలోని తన నివాసం వద్ద ఆయన మాట్లాడారు. ఐదేళ్లు అహర్నిశలు వైసీపీ ప్రభుత్వంపై పోరాడామన్నారు. అందుకే టికెట్ కేటాయిం చకపోవడంతో కార్యకర్తలు ఆగ్రహావేశాలతో ఉన్నారని, తాను బతిమలాడిన తనపైకే వచ్చే పరిస్థితి వచ్చిందని అన్నారు. ఐదేళ్లు తమపైన కపట ప్రేమ కలిగిందోమేనని అనిపిస్తోందన్నారు. దీనికంతటికి పర్యావసానం ఏమిటని ఆలోచిస్తున్నామన్నారు. ఊపిరి ఉన్నంత వరకు తనను నమ్ముకున్న వ్యక్తులను వదిలిపెట్టి పారిపోనన్నారు. ప్రతిపక్షంలో కష్టాలు, నష్టాల్లో పనిచేశామని, ఇప్పుడు మరింత ఉత్సాహంతో పనిచేస్తానని అన్నారు. చంద్రబాబు నాయుడుకు కనువిప్పు కలగాలన్నారు. ఒక మనిషి కష్టపడి క్యారెక్టర్‌ను బిల్డప్ చేసుకొని నిజాయతీగా పనిచేస్తే అన్యాయం చేయడంపై ప్రజల్లో తీర్పు ఏ విధంగా ఉంటుందనే కోణంలో ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. శనివారం 10 గంటలు మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేసి తన భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తానన్నారు. రాష్ట్ర, దేశ ప్రజలకు సందేహాన్ని ఇచ్చే రీతిలో తాను మీడియా సమావేశంలో ప్రసంగిస్తానన్నారు. త్వరలో జిల్లా స్థాయిలో ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేసి ఒక నిర్ణయం తీసుకోవాలని భావిస్తున్నామన్నారు. తనకు టికెట్ ఇవ్వలేదన్న కారణంలో ఒక కార్యకర్త ఆత్మహత్యాయత్నం చేశాడని, మరో కార్యకర్తకు ఫిట్స్ వచ్చాయని, మరో మహిళ కార్యకర్త గుండెపోటుకు గురైందని అన్నారు. ఇలా కార్యకర్తల ప్రాణాలతో చెలగాటం ఆడటం సరికాదన్నారు. జగన్, వైసీపీ నాయకులు తమకు శత్రువులు కాదన్నారు. విధానాలు, సిద్ధాంతాల పరంగా టీడీపీలో పోరాడు తున్న కార్యకర్తలందరి ఆశలు నీరుగార్చిన దురదృష్ట సంఘటన ఇది అని అన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి

అనంతపురం క్రైం, మార్చి 29: నగరంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధురాలు మరణించింది. కళ్యాణదుర్గం బైపాస్‌లో నివాసముంటున్న వెంకటమ్మ (73) మూడో రోడ్డులోని సాయిబాబా గుడి ఎదుట టెంకాయల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తోంది. శుక్రవారం రాత్రి తన ఇంటికి వెళ్తుండగా... పీటీసీ ఎదుట వేగంగా వచ్చిన ఓ ఆటో ఢీకొనడంతో వెంకటమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మరణించింది.

యువతి అనుమానాస్పద మృతి

నగరంలోని సాయినగర్‌లో నివాసముంటున్న శ్రీజ (22) అనుమానాస్పద స్థితిలో శుక్రవారం మరణించింది. ఓ ఇంజెక్షన్ తీసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం. మడకశిర మండలం మద్దనహళ్లికి చెందిన శ్రీజ నగరంలోని కేర్ అండ్ క్యూర్ ఆసుపత్రిలో అనస్తీషియా టెక్నీషియన్‌గా పనిచేస్తోంది. సాయినగర్ మూడో క్రాస్‌లోని ఓ ప్రైవేట్ హాస్టల్‌లో తన సోదరితో కలిసి ఓ గదిలో ఉంటోంది. శుక్రవారం ఉదయం టిఫిన్ చేసిన తరువాత ఓ ఇంజెక్షన్ తీసుకున్నట్లు సమాచారం. అపస్మారక స్థితిలో ఉన్న శ్రీజను చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే ఆమె మరణించినట్లు వైద్యులు తెలిపారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని సీఐ క్రాంతికుమార్ తెలిపారు.

వాల్మీకులకు అధిక సీట్లు కేటాయించడంపై హర్షం

నార్పల,మార్చి 29: వాల్మీకులకు చంద్రబాబు, లోకేష్ అధిక సీట్లు కేటాయించడంపై నార్పల మండల వాల్మీకి ప్రముఖులు చిలమకూరి సుధాకర్, నార్పల తెలుగు అధ్యక్షుడు తలారి హరీష్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం వాల్మీకులు, తెలుగు యువత నాయకులు కేక్‌కట్ చేసి, స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో తలారి మహేష్, చికెనచంద్ర, తలారివంశీ, మధు, పెద్దన్న, సుధాకర్, జగదీష్, లచ్చు, సెల్‌పాయింట్ రాజు, చిన్న, భరత్, పాల్గొన్నారు.

ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం



టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ చిత్రపటంపై పూలు వేసి, నివాళులు అర్పిస్తున్న పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు




కేక్ కట్ చేస్తున్న చంద్రబాబునాయుడు

కదిరి, మార్చి 29: టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని శ్రీసత్యసాయి జిల్లా కదిరి పట్టణంలో ఆ పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కదిరిలో చంద్రబాబునాయుడు గురువారం ప్రజాగళం యాత్ర నిర్వహించారు. కదిరి పట్టణంలోని పీవీఆర్ గ్రాండ్‌లో రాత్రికి బస చేశారు. శుక్రవారం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పీవీఆర్ గ్రాండ్ ఆవరణలో టీడీపీ జెండాను చంద్రబాబు ఆవిష్కరించారు. అనంతరం టీడీపీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్‌కు నివాళి అర్పించారు. తరువాత కేక్ కట్ చేసి, మున్సిపాలిటీలోని 17వ వార్డు కౌన్సిలర్ స్వావిత్రమ్మకు, టీడీపీ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు బీవీ వెంకటరాముడుకు తినిపించారు. కార్యక్రమంలో టీడీపీ కదిరి అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఖాద్రీశుడి బ్రహ్మరథోత్సవం

- అన్ని దారులు కదిరివైపే..
- తరలిరానున్న భక్తజనం
- అదనపు పోలీసు బలగాలతో భద్రతా ఏర్పాట్లు
- భక్తుల కోసం ప్రత్యేక అన్నదాన కేంద్రాలు



రథానికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కదిరి, మార్చి 29: ఖాద్రీశుడి రథోత్సవానికి సర్వం సిద్ధమయ్యింది. దేశంలోనే ప్రాముఖ్యత కలిగిన ఖాద్రీలక్ష్మీనరసింహస్వామి రథాన్ని సుందరంగా అలంకరించారు. అధికారులు, పోలీసు సిబ్బంది రథోత్సవానికి ముమ్మర ఏర్పాట్లు చేశారు. రథం లాగడానికి మొద్దులు, మోకులు, తెడ్లు ఇప్పటికే సిద్ధం చేశారు. భక్తుల రాకకోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖ అదనపు బలగాలను సిద్ధం చేసింది. ఇప్పటికే పలు వాహనాలతో కదిరి పట్టణం నిండిపోయింది. లక్ష్మీనరసింహస్వామి ఆలయం భక్తులతో కిటకిలాడుతోంది. ఉదయం 7.20గంటలనుంచి 8.10 నిమిషాల లోపు అనురాధ నక్షత్రలోని శుభ మేష లగ్నం పుష్కర్మాంశంలో రథాన్ని కదిలించాలని పండితులు ముహూర్తం ఖరారు చేశారు. అన్నిశాఖల సమన్వయంతో ఆలయ అధికారులు రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో అన్నదాన ఏర్పాట్లు విస్తృతంగా చేపట్టారు.

ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

ఖాద్రీశుడి రథోత్సవానికి భక్తులకు ఇబ్బంది లేకుండా ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు కదిరి ఆర్టీసీ డిపో మేనేజర్ మైనుద్దీన్ తెలిపారు డిపోలో ఉన్న 110 బస్సులకు అదనంగా మరో 15 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తామన్నారు. కదిరినుంచి గోరంట్ల మీదుగా హిందూపురానికి 20, నల్లమాడకు 10, మదనపల్లికి 20, బెంగుళూరుకు 15, పులివెందుల 7, తలుపుల 6 బస్సులు ఏర్పాటుచేశామన్నారు. పట్టణంలోని జీవిమానుసర్కిల్, వేమారెడ్డి సర్కిల్, హిందూపురం రోడ్డులోని సరస్వతి విద్యామందిరం వద్ద ప్రయాణీకుల సౌకర్యంగా షెల్టర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



స్వామివారికి ప్రీతిపాత్రమైన దవణం



మొద్దులు, మోకులు సిద్ధం

లక్ష్మీనరసింహస్వామి రథం భక్తుల శక్తి మీదే ముందుకు కదులుతోంది. ఎటువంటి యంత్రాలు ఇం దులోఉపయోగించరు. రథం లాగడానికి మోకులు (తాళ్లు) రథం ముందుకు కదలడానికి వెనుకవైపున వేసే మొద్దులు, రథం సరైన దారిలో నడవడానికి తెడ్లు సిద్ధం చేశారు. ముందు భాగాన భక్తులు మోకులు లాగుతుంటే వెనకబాగాన మొద్దులు వేయడంలో ఆరితేరిన కుటాగుళ్ల, గజ్జలరెడ్డిపల్లి, మూర్తిపల్లి, గంగిరెడ్డిపల్లి గ్రామస్థులు కీలకపాత్ర పోషిస్తారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా భక్తుల గోవింద నామస్మరణ, అర్చకుల వేదమంత్రోచ్చారణలతో రథం ముందుకు కదులుతుంది. తిరువీధులు వెడల్పు 20అడుగకలంటే మించకుండా ఎక్కడ ఇబ్బంది లేకుండా స్వామివారు రథాన్ని ముందుకు నడిపించి, భక్తులకు దర్శనమిస్తూ, యథాస్థానానికి చేరుకుంటారు. అదే ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ప్రత్యేకత, స్వామిని దర్శించుకోవడానికి లక్షలామంది భక్తులు హాజరవుతున్నారు.



బాలకృష్ణకు కృతజ్ఞతలు తెలుపుతున్న అంబికా లక్ష్మీనారాయణ

బాలకృష్ణకు కృతజ్ఞతలు

అనంతపురం అర్బన్, మార్చి 29: టీడీపీ అనంతపురం ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ సినీ నటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణను మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో శుక్రవారం బాలకృష్ణను కలిశారు. తనకు ఎంపీ అభ్యర్థిగా అవకాశం కల్పించేలా సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.



రథోత్సవానికి సిద్ధం చేస్తున్న తెడ్లు

జనమే.. జనం

కదిరికి వచ్చే దారులన్నీ ఇప్పటికే వాహనాలతో నిండిపోయా యి. పట్టణంలో ఎక్కడ చూసినా భక్తజన సందోహంతో కిటకిటలాడుతోంది. వేలాదిమంది ఉన్న భక్తుల సంఖ్య శనివారానికి లక్ష కు పైగా చేరుతుందని అంచనా వేస్తున్నారు. ప్రత్యేకమైన భజనలు, కోలాటలు, బుర్రకథలు, నాటకాలతో పట్టణంలో ఆధ్యాత్మికత వెల్లివిరుస్తోంది.

రథోత్సవానికి తరలిరండి..

: శ్రీనివాసరెడ్డి, ఆలయ ఈఓ

బ్రహ్మోత్సవాల్లో అత్యంత ప్రాధాన్యం కలిగిన బ్రహ్మరథోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేశాం. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తుతోపాటు ఇతర ఏర్పాట్లు పూర్తి చేశాం. భక్తులు భక్తి, శ్రద్ధలతో స్వామి వారిని దర్శించుకుని పునీతులు కావాలని కోరుకుటున్నాం. ఎటువంటి తోపులాటకు అవసరం లేకుండా క్యూ లైన్లలో స్వామిని దర్శించుకోవాలి. సిబ్బందికి, అధికారులకు సహకరించాలి.

విశ్వం పాలిటెక్నిక్, ఏపీఆర్జేసీ అవగాహనా సదస్సుకు

విశేష స్పందన

తిరుపతి(విద్య), మార్చి 29: తిరుపతి వరదరాజనగర్‌లోని విశ్వం టాలెంట్ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన పాలిటెక్నిక్, ఎ.పి.ఆర్.జె.సి నమూనా ప్రవేశ పరీక్షకు, అవగాహనా సదస్సుకు విశేష స్పందన లభించిందని ఆ విద్యాసంస్థల అధినేత, కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థినీ విద్యార్థులు హాజరై నమూనా పరీక్షలు రాశారని చెప్పారు. 2023 పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో విశ్వం విద్యార్థిని చరితశ్రీ 120కి గాను 119 మార్కులతో ప్రథమ ర్యాంకు సాధించిందని వెల్లడించారు. అలాగే ఏపీఆర్జేసీ ఫలితాల్లో తనూజ, భువనేశ్వర్ రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాకులను సాధించారని వివరించారు. పాలిటెక్నిక్‌లో సివిల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్స్, కంప్యూటర్ ఇంజినీరింగ్, మైనింగ్, కెమికల్, బయోమెడికల్ తదితర కోర్సులు ఉంటాయని, మెరుగైన ర్యాంకు సాధించడం ద్వారా మంచి కళాశాలలో సీట్లతోపాటు ఉపాధి ఉద్యోగ అవకాశాలు ఉంటాయని వివరించారు. పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 27 ఉంటుందని, ఏప్రిల్ 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏపీఆర్జేసీ ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 25వ తేదీన ఉంటుందని, మార్చి 31వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 8688888802, 939997 6999లలో సంప్రదించాలని కోరారు.

యువ ఓటర్లే కీలకం

అనంతలో కొత్త ఓటర్లు **43,155 మంది**



- 18నుంచి 49ఏళ్ల వయసు ఓటర్లు 13,71,985
- 80ఏళ్ల పైబడిన ఓటర్లు 25,175
- వందేళ్ల పైబడిన ఓటర్లు 12 మంది

అనంతపురం టౌన్, మార్చి 29: జిల్లాలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో యువ ఓటర్లే కీలకం కానున్నారు. జిల్లా యంత్రాంగం ప్రకటించిన ఓటర్ల జాబితా ప్రకారం ప్రస్తుతం జిల్లాలో 20,01,200మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో వయసుల వారీగా చూస్తే యువ ఓటర్లే అధికంగా ఉన్నారు. 18నుంచి 19ఏళ్ల అంటే కొత్తగా ఓటుహక్కు నమోదు చేసుకున్న వారు అధికారిక లెక్కల ప్రకారం జిల్లాలో 43,155 మంది ఉన్నారు. 18నుంచి 49ఏళ్ల వయస్సు వరకు ఉన్న ఓటర్లు జిల్లా వ్యాప్తంగా 13,71,985 మంది ఉన్నారు. ఇక 50నుంచి ఆపైన వరకు ఉన్న ఓటర్లు 6,29,215మంది ఉన్నారు. ఇందులో కూడా 80ఏళ్ల పైబడిన ఓటర్లు కేవలం 25,175మంది మాత్రమే ఉన్నారు. ఈలెక్కన పరిశీలిస్తే రాబోయే ఎన్నికలలో యువ ఓటర్లే ప్రధాన పాత్ర పోషించనున్నారని తెలుస్తోంది.

● వందేళ్ల పైబడిన ఓటర్లు 12 మంది..



జిల్లా వ్యాప్తంగా వందేళ్ల పైబడిన ఓటర్లు కొత్త జాబితా మేరకు కేవలం 12 మంది ఉన్నారు. కొత్త ఓటర్ల జాబితా నమోదు చేపట్టినప్పటినుంచి ఓటర్ల జాబితాను జిల్లా యంత్రాంగం రూపొందిస్తూ వస్తోంది. అందులో వయసుల వారీగా ఓటర్లను గుర్తించారు. తొలుత మొత్తం ఎనిమిది నియోజకవర్గాలలో కలిపి 20మంది ఉన్నట్లు చూపారు. వీటిని పరిశీలించగా ఒకరి వయసు తప్పుగా ఉన్నట్లు తేల్చి రాయదుర్గం నియోజకవర్గంలో ముగ్గురు, గుంతకల్ నియోజకవర్గంలో ఐదుమంది, తాడిపత్రిలో నలుగురు, రాప్తాడు నియోజకవర్గంలో ఆరుగురు, అనంతపురంఅర్బన్, కల్యాణదుర్గంలలో ఒక్కొక్కరు వందేళ్ల పైబడిన వారు ఉన్నట్లు గుర్తించి రికార్డులలో నమోదు చేసారు. కానీ ప్రస్తుతం విడుదల చేసిన జాబితాలో ఇందులో ఏడుగురు చనిపోయారని ప్రస్తుతం కేవలం 12మంది మాత్రమే వందేళ్ల పైబడిన ఓటర్లు ఉన్నట్లు చూపారు. ఇందులో రాయదుర్గంలో ఇద్దరు, గుంతకల్లులో ముగ్గురు, తాడిపత్రిలో ఇద్దరు, అనంతపురం అర్బన్‌లో ఒకరు, రాప్తాడు నియోజకవర్గంలో నలుగురు వందేళ్ల పైబడిన ఓటర్లు రాబోయే ఎన్నికలలో ఓటు బేయనున్నారు. వీరికి తొలిసారి ఇంటి వద్దనే ఓటు వేసే విధంగా ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించడం విశేషం

● జిల్లాలో వయసు వారీగా ఓటర్లు ఇలా...

వయస్సు	ఓటర్లు
18-19	43,155
20-29	3,65,300
30-39	5,82,480
40-49	4,24,205
50-59	2,94,301
60-69	1,77,754
70-79	88,830
80ఏళ్ల పైబడి	25,155



గజవాహనంపై ఊరేగుతున్న శ్రీవారు

గజవాహనంపై దర్శనమిచ్చిన లక్ష్మీనరసింహుడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఖాద్రీ లక్ష్మీనరసింహుడు శుక్రవారం గజవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నిత్యపూజ, హోమం అనంతరం గ్రామోత్సవాన్ని నిర్వహించారు. సంధ్యాసమయంలో శ్రీవారు గజవాహనంపై ఊరేగారు. శ్రీమహావిష్ణు దశావతారాల్లో ఒక్కటైన నరసింహుడికి దేవేంద్రుడు తన వాహనమైన ఐరావతాన్ని పంపుతారని భక్తుల నమ్మకం. తెల్లవారితే బ్రహ్మరథోత్సవం ఉండటంతో ఆలయ ప్రాంగణంతో పాటు తిరువీధులు భక్తులతో కిక్కిరిసి పోయాయి. - కదిరి

పథకాలు బంద్..!

- పరిశ్రమల శాఖకు ఎన్నికల కోడ్ ఎఫెక్ట్
- విశ్వకర్మ, ఇతర పథకాల నిలిపివేత
- నిరాశలో లబ్ధిదారులు

అనంతపురం అర్బన్, మార్చి 29: సార్వత్రిక ఎన్నికల కోడ్ ఎఫెక్ట్ పరిశ్రమల శాఖ పథకాలపై ప్రభావం చూపింది. గతంలో ముందు నుంచి కొనసాగుతున్న పథకాలకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి నుంచి మినహాయింపు ఇస్తూ వచ్చారు. ఈ సారి అలాంటి ఆన్‌గోయింగ్ పథకాలను నిలిపివేయాలని ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకంతోపాటు ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకాన్ని నిలిపివేశారు. ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అమలయ్యే ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ పాలసీ, జగనన్న బడుగు వికాస పథకాలకు లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్న ఒక్క పరిశ్రమ మంజూరు చేయలేదు. ఇంతలోగా ఎన్నికల కోడ్ అమలు కావడంతో ఆ పథకాలు బంద్ అయ్యాయి.

ఎక్కడి దరఖాస్తులు అక్కడే...

కేంద్ర విశ్వకర్మ పోర్టల్ నుంచి ఇప్పటి దాకా 54,794 మంది దరఖాస్తులను గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీలకు పంపారు. ఇందులో జిల్లా స్థాయికి 5,682 దరఖాస్తులు సిఫార్సు చేశారు. ఇందులో 2,732 దరఖాస్తులు రాష్ట్ర స్థాయి అధికారులకు సిఫార్సు చేశారు. అలాగే గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీ స్థాయిలో 151, జిల్లా స్థాయిలో 343 దరఖాస్తులను సిఫార్సు చేయలేదు. అదే విధంగా గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీ స్థాయిలో 40,472 మంది దరఖాస్తులు, జిల్లాస్థాయిలో 48,769 దరఖాస్తులు, రాష్ట్రస్థాయిలో 2,949 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఆన్‌గోయింగ్ స్కీంలకు ఎన్నికల కోడ్ నుంచి ఈసారి మినహాయింపు ఇవ్వకపోవడంతో విశ్వకర్మ పథకం దరఖాస్తులు ఎక్కడివక్కడ ఆగిపోయాయి. ఎన్నికల తర్వాత ఆయా దరఖాస్తులను రాష్ట్ర స్థాయికి పంపించి, అర్హులైన లబ్ధిదారులకు శిక్షణ ఇచ్చి, బ్యాంక్ రుణాలు అందేలా చర్యలు తీసుకుంటామని పరిశ్రమల శాఖ జీఎం నాగరాజారావు పేర్కొన్నారు.



జిల్లా పరిశ్రమల శాఖ కార్యాలయం (ఫైల్)

బేఖాతర్..!

- వేటు వేస్తున్నా మారని వలంటీర్ల తీరు
- యథేచ్ఛగా వైసీపీకి ప్రచారం..

నల్లచెరువు, మార్చి 29: వలంటీర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొనరాదని సాక్షాత్తు కలెక్టర్ హెచ్చరిస్తున్నా.. తొలగింపు వేటు వేస్తున్నా వారిలో మార్పు రావడం లేదు. వైసీపీ నేతల ప్రచారంలో జోరుగా పాల్గొంటూ నిబంధనలు బేఖాతర్ చేస్తున్నారు. నల్ల చెరువు మండలంలో 18మంది వలంటీర్లను తొలగించినట్లు ఎంపీడీఓ రాణెమ్మ తెలిపారు. వైసీపీ ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తొలగించినట్లు తెలిపారు.

ప్రచారంలో పాల్గొన్న వలంటీర్‌కు నోటీసు

గోరంట్ల : మండలంలోని బూదిలిపల్లి పంచాయతీ గంగాదేవిపల్లిలో జరిగిన వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వలంటీర్ బోయ రమేష్‌కు ఎంపీడీఓ, ఎంసీసీ అధికారి ప్రవీణ్‌కుమార్ శుక్రవారం నోటీసు జారీ చేశారు. వలంటీర్ రమేష్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న విషయాన్ని 'ఎన్నికల ప్రచారంలో వలంటీర్' అనేవార్తను ఆంధ్రజ్యోతి శుక్రవారం ప్రచురించింది. స్పందించిన ఎంపీడీఓ పంచాయతీ కార్యదర్శి గంగాధర్‌నాయక్ ద్వారా వలంటీర్‌కు నోటీసు జారీ చేసి, సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించారు. అలాగే కార్యదర్శిని జరిగిన సంఘటనపై విచారణ జరిపి, వెంటనే నివేదిక ఇవ్వాలని సూచించారు. పరిశీలిన నివేదిక అందిక అందిన వెంటనే ఉన్నతాధికారులకు తెలిపి, వారి ఆదేశం మేరకు వలంటీర్‌పై చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ వెల్లడించారు. అలాగే సిరగంవాండ్లపల్లిలో ఇళ్లు, పశువుల పాకలకు వైసీపీజెండాలు ఉండడంతో కోడ్‌ను పట్టించుకోరా అంటూ కథనం రావడంతో అధికారులు స్పందించారు. పంచాయతీ సిబ్బంది పార్టీ జెండాలు తొలగించారు.

ఎన్నికల ప్రచారంలో వలంటీర్లు

విడపనకల్లు: వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వేశ్వరరెడ్డి తనయుడు ప్రణయ్‌రెడ్డి శుక్రవారం హావళిగిలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో వలంటీర్లు పాల్గొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వలంటీర్లు కొల్లారప్ప, జయన్న, సోమదాసు పాల్గొన్నారు. మాస్కులు ధరించి గుర్తు పట్టకుండా ప్రచారం నిర్వహించడం కొసమెరుపు. ప్రణయ్‌రెడ్డితో పాటు ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. అలాగే ఫీల్డ్ అసిస్టెంట్ మల్లికార్జున కూడా పాల్గొనడంపై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



ప్రచారంలో పాల్గొన్న వలంటీర్లు జయన్న, సోమదాసు(మాస్కుల్లో..)

ఘనంగా గుడ్‌ఫ్రైడే



తాడిపత్రిలో క్రైస్తవుల శిలువయాత్ర

గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకొని పలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సర్వమానవాళి పాపపరిహారార్థం క్రీస్తు శిలువ ఎక్కిన రోజును క్రైస్తవులు గుడ్‌ఫ్రైడేగా జరుపుకుంటారని పాస్టర్లు పేర్కొన్నారు. అనంతరం క్రీస్తు సందేశాన్ని వినిపించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం క్రీస్తు ఆరాధన తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

- ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్

కర్ణాటక మద్యం పట్టివేత

బొమ్మనహాళ్, మార్చి 29: మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు కణేకల్లు సెబ్ అధికారులు తెలిపారు. ఉద్దేహాళ్ గ్రామానికి చెందిన రుద్రప్ప కర్ణాటక మద్యాన్ని తీసుకొచ్చి విక్రయిస్తుండగా అతని నుంచి 41 కర్ణాటక టెట్రా ప్యాకెట్లను స్వాధీన పరచుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టుకు హాజరుపరుస్తున్నట్లు సెబ్ అధికారులు తెలిపారు.



మాట్లాడుతున్న జితేంద్రగౌడ్(గుంతకల్లుటౌన్)



కణేకల్లులో కేకును కట్ చేస్తున్న టీడీపీ యువత



యాడికిలో ఆవిర్భావ వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న జేసీపీఆర్(పెద్దవడుగూరు)



కుందుర్పి మండలం బెస్తరపల్లిలో ...

బడుగుల పార్టీ తెలుగుదేశం

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో పార్టీ కార్యాలయాల వద్ద ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పార్టీ జెండాను ఎగురవేశారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ పేదలు, బడుగులు, బలహీన వర్గాల అభివృద్ధే ధ్యేయంగా ఆవిర్భవించిన పార్టీ టీడీపీ అని పేర్కొన్నారు. వేడుకల నిర్వహణతో ఆయా ప్రాంతాల వద్ద కోలాహలం నెలకొంది.

- ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్



కళ్యాణదుర్గం ఎన్టీఆర్ భవన్ వద్ద టీడీపీ జెండాను ఆవిష్కరిస్తున్న అమిలినేని సురేంద్రబాబు



ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న టీడీపీ శ్రేణులు(రాయదుర్గం)



డి.హీరేహాళ్‌లో...



ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వెంకటశివుడు యాదవ్(గుత్తి)



కూడేరు..

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి: కేశవ్



ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే కేశవ్

ఉరవకొండ, మార్చి29: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. పట్టణంలోని 10వ వార్డులో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. పార్కు ఆంజనేయస్వామి గుడిలో పూజలు నిర్వహించి ప్రచారం చేపట్టారు. మూగబసప్ప కట్ట వద్ద దళితులు డప్పులతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను ఇంటింటికీ వెళ్లి అందజే శారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పట్ల వ్యతిరేకత, టీడీపీపై సానుకూలలత ప్రజల మాటల్లో స్పష్టంగా కనబడుతోందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాలను మోసం చేశారన్నారు. కార్యక్రమంలో విజయ్‌భాస్కర్, రేగాటి నాగరాజు, సుంకరత్నమ్మ, రామాంజనేయులు, తిమ్మప్ప, డీకే ప్రసాద్, గోవిందు, ప్యారం కేశవానంద, రాజేష్ పాల్గొన్నారు.

భవిష్యత్తు గ్యారెంటీపై విస్తృత ప్రచారం

బెళుగుప్ప, మార్చి 29: మండలంలోని వీరాంజనేయ కొట్టాల, జీడిపల్లి గ్రామాల్లో శుక్రవారం ఎమ్మెల్యే పయ్యావుల కేశవ తనయుడు విక్రమ్‌సింహా బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ మేనిఫెస్టోపై ప్రచారం చేపట్టారు. జీడిపల్లిలో గ్రామ టీడీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఆయన ఇంటింటికి వెళ్లి ఓట్లను అభ్యర్థించారు.

కూడేరు: వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ తనయుడు పయ్యావుల విజయ్ సింహ పిలుపునిచ్చారు. శుక్రవారం కూడేరు మండలం కమ్మూరు గ్రామంలో బాబుష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి సైకిల్‌కు ఓటు వేయాలని కోరారు.

టీడీపీలో టిక్కెట్ చిచ్చు

గుంతకల్లులో మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్ వర్గీయుల ఆందోళన



పార్టీ కార్యాలయం ఎదుట ఫర్నిచర్, కరపత్రాలను దహనం

గుంతకల్లు, మార్చి 29: గుంతకల్లు ఎమ్మెల్యే టిక్కెట్‌ను గుమ్మనూరు జయరాంకు కేటాయించడంతో మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడు వర్గీయులు తీవ్ర ఆగ్రహావేశాలకు గురయ్యారు. గుమ్మనూరుకు టిక్కెట్ ఖరారు కాగానే ఆయన వర్గీయులు శుక్రవారం మధ్యాహ్నం టపాసులు పేల్చి సంబరాలు చేసుకున్నారు. అదే సమయంలో టీడీపీ కార్యాలయంలో జితేంద్రగౌడు వర్గీయులు ఆగ్రహంతో ఊగిపోయారు. పార్టీ కార్యాలయంలోని కుర్చీలను, కరపత్రాలను రోడ్డుపై వేసి నిప్పుపెట్టారు. చంద్రబాబు నాయుడు చిత్రపటాన్ని రోడ్డుపైకి తెచ్చి అవమానపరచి, మంటల్లో వేసి తగులబెట్టారు. పార్టీకి, చంద్రబాబుకు, జిల్లా నాయకులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కష్టకాలంలో పార్టీ అభ్యున్నతికి పాటుపడిన జితేంద్రగౌడుకు అన్యాయం చేశారని, గుమ్మనూరు జయరాంను ఓడిస్తామని శపథం చేశారు. తిలక్ నగర్‌లోని జితేంద్రగౌడు క్యాంపు కార్యాలయం వద్ద కూడా కార్యకర్తలు పార్టీ కరపత్రాలను దహనం చేశారు. తన వర్గీయులతో మూడు నాలుగు రోజుల్లో సమావేశమై, భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తానని జితేంద్రగౌడు తెలిపారు.

కార్యకర్తల అభీష్టం మేరకే ...

మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్



మాట్లాడుతున్న జితేంద్రగౌడ్

గుంతకల్లు టౌన్,మార్చి29: కార్యకర్తల అభీష్టం మేరకు భవిష్యత్తు కార్యచరణ ప్రకటిస్తానని టీడీపీ మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్ పేర్కొన్నారు. గుంతకల్లు టీడీపీ టిక్కెట్ గుమ్మనూరు జయరాంకు కేటాయించడంతో శుక్రవారం సాయంత్రం తన క్యాంపు కార్యాలయంలో గుంతకల్లు, గుత్తి, పామిడికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలతో అత్యవర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పక్క జిల్లా నుంచి వచ్చిన వారికి చంద్రబాబు ఏ విధంగా టికెట్ ఇచ్చారో అర్థం కావడంలేదన్నారు. మాది రాజకీయ కుటుంబం, మా నాన్న రాజకీయంలో ఉన్నప్పటినుంచి మేము రాజకీయాల్లో నడుచుకుంటూ వచ్చామన్నారు. కార్యకర్తలు ఒక నిర్ణయానికి వచ్చి తెలిపితే అలా నడుచుకుంటానన్నారు. అనంతరం పలువురు టీడీపీ నాయకులు మాట్లాడుతూ చంద్రబాబు పునరాలోచించి పార్టీకోసం కష్టపడిన జితేంద్రగౌడ్‌కు టిక్కెట్ ఇవ్వాలన్నారు. జితేంద్రగౌడ్‌కు అండగా ఉంటామన్నారు. ఈ సమావేశంలో గుంతకల్లు, గుత్తి, పామిడికి చెందిన నాయకులు అబ్దుల్ జిలాన్, లక్ష్మీనారాయణ, శ్రీనివాసయాదవ్, కేశప్ప, తలారిమస్తానప్ప, హేమాద్రి, పాలమల్లికార్జున, వీరేష్‌కుమార్, రాయలరామయ్య, ప్రవీణ్‌కుమార్‌గౌడ్, గుమ్మనూర్ వెంకటేష్, బీ లక్ష్మిదేవి, గిడ్డయ్య, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీని గెలిపిస్తే మరింత అభివృద్ధి: కాలవ



ఆవులదట్లలో ప్రచారం నిర్వహిస్తున్న కాలవ శ్రీనివాసులు

రాయదుర్గంరూరల్, మార్చి 29: నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలంటే సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. మండలంలోని ఆవులదట్ల గ్రామంలో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆవులదట్ల 36 ప్యాకేజీ బ్రాంచ్ కెనాల్ పనులు జరగాలన్నా ఈ ప్రాంతం సస్యశ్యామలం కావాలన్నా టీడీపీతోనే సాధ్యమన్నారు. నియోజకవర్గానికి తాను రూ. 4,500 కోట్లు నిధులు తెచ్చినట్లు వెల్లడించారు. నియోజకవర్గానికి మెట్టు వల్ల బొట్టు ప్రయోజనం లేదన్నారు. గ్రామీణ ప్రాంతంలో ఓటు అడిగే హక్కు మెట్టుకు లేదన్నారు. వైసీపీ పాలనలో విద్యుత్ బిల్లులు, నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. రైతులకు తెలుగుదేశం ప్రభుత్వంతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అనంతరం సూపర్‌సిక్స్ పథకాలపై ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జ్ మంజునాథగౌడ్, పాటిల్ సదాశివరెడ్డి, పాటిల్ అజయ్‌కుమార్‌రెడ్డి, హనుమంతు, వన్నూరుస్వామి, రాజశేఖర్ రెడ్డి, అశోక్, మల్లేశప్ప, వన్నూరుస్వామి, టీడీపీ నాయకులు ముల్లంగి నారాయణస్వామి, కాదలూరు మోహన్‌రెడ్డి, పోట్ల రవి పాల్గొన్నారు.

అమిలినేని గెలుపుతో అభివృద్ధికి బాటలు



బ్రహ్మసముద్రంలో అమిలినేని సురేంద్రబాబు ప్రచారం

కళ్యాణదుర్గం, మార్చి 29: కళ్యాణదుర్గం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్ర బాబును గెలిపించి అభివృద్ధికి బాటలు వేద్దామని ఆయన భార్య రమాదేవి, చెల్లెలు రాధ, కోడలు ఇషిత, కుమారుడు యశ్వంత్ చౌదరి పేర్కొన్నారు. శుక్రవారం కళ్యాణదుర్గం మున్సిపాల్టీలోని పదవవార్డు, మారెంపల్లి కాలనీలో అమిలినేని యశ్వంత్ ఇంటింటికి వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. శెట్టూరు మండలం కనుకూరులో అమిలినేని సురేంద్రబాబు భార్య రమాదేవి, చెల్లెలు రాధ, కోడలు ఇషిత ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. టీడీపీ ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు.

బ్రహ్మసముద్రంలో ఘన స్వాగతం

బ్రహ్మసముద్రం: టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబుకు బ్రహ్మసముద్రంలో శుక్రవారం ఘన స్వాగతం లభించింది. మండలకేంద్రానికి వచ్చిన ఆయనను నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున గజమాలతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అమిలినేని సురేంద్రబాబు మాట్లాడుతూ ఇంతటి ఘన స్వాగతం పలికిన మండల టీడీపీ నాయకులకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని, మండల ప్రజలకు అందుబాటులో ఉండి అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



శెట్టూరు మండలం కనుకూరులో అమిలినేని సురేంద్రబాబు భార్య, చెల్లెలు, కోడలు ప్రచారం

టీడీపీలో చేరిన వైసీపీ మద్దతుదారులు

పెద్దవడుగూరు, మార్చి 29: మండలంలోని మిడుతూరు గ్రామానికి చెందిన 30 వైసీపీ కుటుంబాలు శుక్రవారం తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరాయి. పార్టీలో చేరిన వారిలో వైసీపీవార్డు మెంబరు కత్తి సుంకన్న, రాము, సాంబశివుడు, మల్లికార్జున, రఘునాథ్‌గౌడ్, వెంకటలక్ష్మి, హరి, రామాంజనేయులుతోపాటు మరికొంతమంది ఉన్నారు. టీడీపీ అభివృద్ధికోసం పాటుపడుతున్న రమేష్‌యాదవ్, సూర్యనారాయణరెడ్డిలను జేసీపీఆర్ అభినందించారు. కార్యక్రమంలో కేశవరెడ్డి, గంగరాజుయాదవ్, ప్రసాద్‌యాదవ్, దివాకర్‌రెడ్డి, చిరంజీవులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆవులదట్లలో...

రాయదుర్గంరూరల్, మార్చి 29: మండలంలోని ఆవులదట్ల గ్రామంలో శుక్రవారం 30 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు వారికి కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ నెమ్యానాయక్‌తో పాటు రాజునాయక్, రాముడునాయక్‌లతో పాటు 30 కుటుంబాలు పార్టీలో చేరాయి. కార్యక్రమంలో మండల కన్వీనర్ హనుమంతు, సర్పంచ్ వన్నూరుస్వామి, జనసేన ఇన్‌ఛార్జ్ మంజునాథ్‌గౌడ్, పాటిల్ సదాశివరెడ్డి, పాటిల్ అజయ్‌కుమార్‌రెడ్డి, పోట్ల రవి, కాటా వెంకటేశులు, ప్రసాద్, ఆంజనేయులు, వెంకటేష్‌నాయక్ పాల్గొన్నారు.

గొర్రెల కాపరి మృతి

ఉరవకొండ, మార్చి29: పట్టణంలోని గవిమఠం ఆవణంలో గొర్రెల కాపరి నాగార్జున(35) శుక్రవారం మృతి చెందాడు. ఆమిద్యాలకు చెందిన నాగార్జున గవిమఠంలో నిద్ర చేశాడు. ఉదయం భక్తులు ఆయన్ను లేపడానికి ప్రయత్నించగా లేవలేదు. దీంతో వారు పోలీసులకు సమాచారమందించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు. ఎండ వేడిమికి మృతి చెంది ఉండవచ్చని వైద్యులు తెలిపారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ట్రైనీ డీఎస్పీ

పెద్దపప్పూరు, మార్చి29: మండలంలోని ముచ్చుకోట, వరదాయపల్లి, అమ్మలదిన్నె, కొత్తపల్లి, చిక్కేపల్లి, నామనాంకపల్లి తదితర గ్రామాల్లో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాలను శుక్రవారం ట్రైనీ డీఎస్పీ హేమంత్‌కుమార్ పరిశీలించారు. ఆయా కేంద్రాల్లో మౌళిక సదుపాయాలపై ఆరాతీశారు.

ఇసుకరీచ్ తనిఖీ



తనిఖీ చేస్తున్న మైన్స్ అండ్ జియాలజీ ఏడీ

రాయదుర్గంరూరల్, మార్చి 29: మండలంలోని వేపరాల, జుంజురంపల్లి వద్ద ఏర్పాటు చేసిన ఇసుకరీచ్‌లను మైన్స్ అండ్ జియాలజీ ఏడీ నాగయ్య, సెబ్ అడిషనల్ ఎస్పీ రామకృష్ణ, ఆర్డీఓ రాణిసుస్మిత శుక్రవారం తనిఖీ చేశారు. మూడురోజుల క్రితం హైకోర్టు ఇసుకరీచ్‌లపై సమగ్ర విచారణ జరిపించాలని ఆదేశించింది. దీంతో మైన్స్ అండ్ జియాలజీ ఏడీ నాగయ్య, సెబ్ అడిషనల్ ఎస్పీ రామకృష్ణ కలిసి ఇసుకరీచ్‌లను తనిఖీ చేశారు. రీచులలో ఎంతమేర ఇసుకను తరలించారనే సమగ్రమైన విషయాన్ని సేకరించి వివరాలను హైకోర్టుకు పంపనున్నట్లు తెలిపారు.

తాడిపత్రిలో కూటమి అభ్యర్థిని గెలిపిస్తాం



జేసీ అశ్మిత్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

తాడిపత్రిటౌన్, మార్చి29: తాడిపత్రి ఎమ్మెల్యేగా కూటమి అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డిని గెలిపించేందుకు కృషి చేస్తామని బీజేపీ, జనసేన, ఎమ్మార్పీఎస్ నాయకులు తెలిపారు. పట్టణంలోని ఎస్వీ కల్యాణ మండపంలో శుక్రవారం కార్యకర్తల సమావేశం జరిగింది. సమావేశానికి కూటమి అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉమ్మడి అభ్యర్థి గెలుపే అభివృద్ధికి రాచబాట వేస్తుందన్నారు. అనంతరం జేసీ అశ్మిత్‌రెడ్డికి శాలువాకప్పి ఘనంగా సన్మానించారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, నాయకులు పీవీ ప్రతాప్‌రెడ్డి, అంకాల్‌రెడ్డి, శింగరి లక్ష్మీనారాయణ, రంగనాథరెడ్డి, ఆంజనేయులు, గంగాధర్, రామాంజనేయులు, జనసేన నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఏ ముఖం పెట్టుకుని ఓట్లడుగుతారు?

గుంతకల్లు, మార్చి29: నియోజకవర్గానికి ఇచ్చిన హామీలేవీ నెరవేర్చకుండా ముఖ్యమంత్రి జగన్, ఎమ్మెల్యే వై వెంకట రామిరెడ్డి ఏ ముఖం పెట్టుకుని ఓట్లడుగుతారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వెంకట శివుడు యాదవ్ ప్రశ్నించారు. శుక్రవారం ఉదయం తన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. గుత్తిలో తాగునీటి సమస్యను తీరుస్తామని హామీ ఇచ్చి ఐదేళ్లయిందని, ఇప్పటికీ పట్టణవాసులు తాగునీటికి కటకట అనుభవిస్తున్నారన్నారు. గుంతకల్లులో ముస్లిం మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల పనులు అసంపూర్ణంగా నిలిపివేశారన్నారు. రాగులపాడు వద్ద తూమును ఏర్పాటుచేసి గుంతకల్లు నియోజకవర్గంలో 12 చెరువులకు నీరిస్తామంటూ ఆర్భాటంగా శంకుస్థాపన చేసి చేతులు దులుపుకున్నారన్నారు. ఇంకా పామిడిలో టెక్స్‌టైల్ పార్కు, గుంతకల్లులో ఏసీఎస్ మిల్లును తెరిపిస్తామంటూ శుష్క వాగ్దానాలిచ్చి పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఈ వాగ్దానాలను ఎందుకు నెరవేర్చలేకపోయారో జగన్, వెంకటరామిరెడ్డి మొదట సమాధానం చెప్పి, ఆ తర్వాత ఓటడగాలన్నారు. సమావేశంలో బండారు ఆనంద్, బొజ్జేనాయక్, రామరాజు యాదవ్, మీటూ నాయక్ పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ

డీ.హీరేహాళ్, మార్చి 29: గ్రామాలలో ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు నిర్వహిస్తున్నట్లు డీఎస్పీ శ్రీనివాసులు తెలియజేశారు. మండలంలోని సమస్యాత్మకమైన గ్రామాలలో కేంద్ర బలగాలతో కలిసి శుక్రవారం భారీ ఎత్తున పోలీసు కవాతు నిర్వహించారు. మండలంలోని మురడి, ఓబుళాపురం, డీ.హీరేహాళ్, కల్యం గ్రామాలలో డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసు కవాతు నిర్వహించారు.

బాలుడి కిడ్నాప్‌నకు యత్నం

కళ్యాణదుర్గం, మార్చి 29: కంబదూరు వైఎస్సార్ సర్కిల్ సమీపంలో ఉన్న కోట వీధిలో ఓ బాలుడి కిడ్నాప్ యత్నం స్థానికంగా కలకలం రేపింది. గురువారం ఆర్టీసీ కండక్టర్ బలిజ గంగాధర కుమారుడు గౌతమ్ కౌశిక్ అతడి తాతతో కలిసి ఇంటి బయట మంచంపై నిద్రించాడు. అయితే ఒక వ్యక్తి వచ్చి మంచం మీద పడుకున్న బాలుడుపై చేయి వేసి ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించాడు. అయితే బాలుడి చేయి తాతకు తగలడంతో మేలుకున్న ఆయన ఆ వ్యక్తిని పట్టుకునేందుకు ప్రయత్నించాడు. గట్టిగా కేకలు వేయడంతో ఆ బాలుడిని వదిలేసి పరారైనట్లు తెలిపారు. రాత్రి 11 గంటల సమయంలో ఒక కారు హల్‌చల్ చేసినట్లు బాలుడి కుటుంబ సభ్యులు తెలిపారు. ఆ బాలుడి తల్లిదండ్రులు వెంటనే 100కు ఫిర్యాదు చేయడంతో పోలీసులు వెంటనే అక్కడకు చేరుకుని విచారించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కంబదూరులో జోరుగా టీడీపీలోకి వలసలు

కళ్యాణదుర్గం, మార్చి 29: కంబదూరు మండలంలో టీడీపీలోకి వలసలు ఊపందుకున్నాయి. శుక్రవారం చెర్లోపల్లి గ్రామానికి చెందిన 9వ వార్డు మెంబర్ తిమ్మరాజు, నాగభూషణ, ప్రశాంత్ కుమార్, రఘు, అనిల్‌తో పాటు ఐదు కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలోకి చేరాయి. వీరందరికీ టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కరణం రామ్మోహన్ చౌదరి, అమిలినేని లక్ష్మీనారాయణ, గాజుల శ్రీరాములు, తలారి యర్రిస్వామి, శివన్న తదితరులు టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

గుమ్మనూరుకు టిక్కెట్టు కేటాయింపుపై సంబరాలు

పామిడి, మార్చి 29: గుంతకల్లు అసెంబ్లీ టీడీపీ టిక్కెట్టు మాజీమంత్రి గుమ్మనూరు జయరాంకు కేటాయించడంతో శుక్రవారం సాయంత్రం ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. ఎన్టీఆర్ విగ్రహం వద్ద బాణసంచా పేల్చారు. అక్కడి నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకూ ర్యాలీగా వెళ్లి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి టపాసులు పేల్చారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్‌చౌదరి, బొల్లు శ్రీనివాసరెడ్డి, అప్పన్నగారి కుమార్, బొమ్మా మోహన్‌కృష్ణ, సత్యనారాయణ, నంద్యాల వెంకటేష్, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు/ గుత్తి: గుంతకల్లు టిక్కెట్టు మాజీ మంత్రి గుమ్మనూరు జయరాంకు టీడీపీ టికెట్ కేటాయించడం పట్ల పట్టణంలో టీడీపీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున శుక్రవారం సంబరాలు చేసుకున్నారు. స్థానిక గాంధీ సర్కిల్‌లో టపాసులు కాల్చారు. టీడీపీ నాయకులు నారాయణస్వామి, న్యాయవాది సోమశేఖర్, రవి, ప్రతాప్, కృష్ణయ్య, చెన్నరాయుడు, ఓబయ్య పాల్గొన్నారు.



గుత్తిలో సంబరాలు చేసుకుంటున్న టీడీపీ నాయకులు

గుంతకల్లు పట్టణంలోనూ, కసాపురం రహదారిలో ఏర్పాటుచేసిన జయరాం వ్యక్తిగత పార్టీ కార్యాలయం వద్ద ఆయన వర్గీయులు సంబరాలు జరుపుకున్నారు.

పార్టీ నమ్మకాన్ని నిలుపుకుంటారు

గుంతకల్లు: రానున్న ఎన్నికల్లో గుమ్మనూరు జయరాం గెలుపు సాధిస్తారన్న నమ్మకంతోనే టీడీపీ అధిష్టానం ఆయనకు టిక్కెట్టును కేటాయించిందని, భారీ మెజారిటీతో గెలిచి పార్టీ నమ్మకాన్ని నిలబెడతామని జయరాం సోదరుడు నారాయణ స్వామి పేర్కొన్నారు. జయరాంకు గుంతకల్లు అసెంబ్లీ టిక్కెట్టును కేటాయించడంతో కసాపురం రహదారిలోని వ్యక్తిగత పార్టీ కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జయరాం సోదరులు శ్రీనివాసులు, నారాయణస్వామి మాట్లాడుతూ టిక్కెట్టును కేటాయించిన అధిష్టానానికి ధన్యవాదాలు తెలిపారు. జితేంద్రగౌడు, వెంకట శివుడు యాదవ్ తదితర టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులను కలుపుకుని బరిలోకి దిగుతామన్నారు.

కేసీ హరితో గుమ్మనూరు సోదరుల భేటీ

పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా టిక్కెట్టు సాధించిన గుమ్మనూరు జయరాం గెలుపునకు సహకరించాలని ఆయన సోదరులు టీడీపీ సీనియర్ నాయకుడు కేసీ హరిని కోరారు. శుక్రవారం గుమ్మనూరు జయరాంకు పార్టీ టికెట్టు ఖరారుకాగానే ఆయన సోదరులు శ్రీనివాసులు, నారాయణస్వామి, తమ అనుచరులతో కేసీ హరి ఇంటికి వెళ్లి ఆయనతో భేటీ అయ్యారు. త్వరలో తమ సోదరుడు స్వయంగా వచ్చి కలుస్తారని తెలిపారు. కేసీ హరి మాట్లాడుతూ పార్టీ నిర్ణయించిన జయరాం గెలుపునకు కృషి చేస్తానని తెలియజేశారు.



పామిడిలో టీడీపీ నాయకులు, కార్యకర్తల సంబరాలు

జయరాంకు సంపూర్ణ మద్దతునివ్వాలి

టీడీపీ అధిష్టానం గుంతకల్లు ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలోకి దింపిన గుమ్మనూరు జయరాంకు పార్టీ శ్రేణులు సంపూర్ణ మద్దతును ఇవ్వాలని టీడీపీ డాక్టర్స్ సెల్ అధ్యక్షురాలు పత్తి హిమబిందు పేర్కొన్నారు. అభ్యర్థి జయరాంకు తాను సహకారం అందిస్తానని శుక్రవారం సాయంత్రం విడుదల చేసిన ఓ ప్రకటనలో ఆమె వెల్లడించారు.